28012025-MAI-04_Layout 1 1/28/2025 2:44 AM Page 1

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

బెనిఫిట్స్ బెంగ

రాష్ట్ర ప్రభుత్వ అసమర్థ ఆర్థిక నిర్వహణ ఫలితంగా ప్రజలు నిత్యం సమస్యలు ఎదుర్కొంటున్నారు. సాధారణమైన అవసరాలకూ నిధులు సమకూర్చుకోలేని పరిస్థితుల్లోకి జారుకుంటున్నది మన రాష్ట్రం. అమలుకాని హామీలు, పట్టాలెక్కని పథకాల మాట అటుంచితే కనీసం ఉద్యోగ విరమణ తర్వాత రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా ఇవ్వలేక ప్రభుత్వం చేతులెత్తేస్తున్నది. ఫలితంగా విశ్రాంత ఉద్యోగులు, అధికారులూ విషమ సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఏడాది కాలంలో 8 వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ చేస్తే వారిలో ఏ ఒక్కరికీ ప్రయోజనాలు అందని పరిస్థితి నెలకొనడం విచారకరం. వారిలో 200 మంది ఈసరికే కోర్టును ఆశ్రయించారు. మలిసంజెలో ఆదుకుంటాయనుకున్న బెనిఫిట్స్ ఎంతకూ చేతికందకపోవడంతో కొంతమంది నిస్పృహకు గురై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. బెనిఫిట్స్ తక్షణమే విడుదల చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానని రిటైర్డ్ ఏఎస్సై సాధిక్ విడుదల చేసిన వీడియో సంచలనం సృష్టించింది. పదవీ విరమణ చేసిన 45 రోజుల్లో యావత్తు సొమ్ము చెల్లించాలని ఉన్నత న్యాయస్థానం మందలించినా సర్కారు తీరులో మార్పు రాకపోవడం విచారకరం.

ప్రభుత్వ ఉద్యోగం దక్కించుకోవడమంటే జీవితానికి భరోసా పొందడమే అని భావించేవారు. పదవీ కాలంలో జీతాలు, పదవీ విరమణ అనంతరం బెనిఫిట్లు, పింఛన్లు లభిస్తాయనే నమ్మకమే అందుకు కారణం. జీవన గమనంలో అలసిపోయిన రిటైర్డ్ ఉద్యోగులు బెనిఫిట్స్ మీద కోటి ఆశలు పెట్టుకుంటారు. ప్రశాంత జీవనానికి ఇల్లు కట్టుకుందామనో, బిడ్డ పెండ్లి చేసి బాధ్యత తీర్చుకుందామనో అనుకుంటారు. కొందరికి అప్పుల సమస్య కూడా ఉంటుంది. వాటినీ తీర్చేసి నిమ్మలంగా గడపవచ్చనీ అనుకుంటారు. ఇంకా ఎన్నెన్నో ప్రణాళికలు వేసుకుంటారు. సకాలంలో ఆదుకుంటాయనుకున్న నిధులు విడుదల చేయకుండా తాత్సారం చేయడం భావ్యం కాదు. కానీ, సచివాలయం చుట్టూ ఎన్నోసార్లు ప్రదక్షిణ చేసినా ఫైల్ కదలకపోవడంతో విశ్రాంత ఉద్యోగులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు.

రాష్ట్రంలో సుమారు 3.9 లక్షల మంది ఉద్యోగులుంటే వారిలో ప్రతి నెలా 800 నుంచి 1000 మంది రిటైర్ అవుతారు. ఒక్కొక్కరికి జీపీఎఫ్, సరెండర్ లీవులు తదితరాల కింద రూ.35 లక్షల నుంచి రూ.70 లక్షల దాకా చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు ఏటా రూ.4 వేల కోట్ల పైచిలుకు రిటైర్మెంట్ బెనిఫిట్ల కింద చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు పెన్షన్ చెల్లింపులు కూడా ఏటా పెరుగుతున్నాయి. ప్రభుత్వం ఈ చెల్లింపుల భారాన్ని తప్పించుకునేందుకు రకరకాల ఎత్తులు వేస్తున్నది. బడా కాంట్రాక్టర్లకు భారీ నిధులు బిల్లుల రూపంలో విచ్చలవిడిగా విడుదల చేస్తూ, విశ్రాంత ఉద్యోగులకు మాత్రం బాండ్లు చేతిలో పెడుతున్నది. ఖర్చులకు రొక్కం లేనప్పుడు కాగితాలతో ఏం లాభం? మరోవైపు రిటైర్మెంట్ వయసు పొడిగించి మరింత ఉపశమనం పొందవచ్చని సర్కారు ఇంకో ఎత్తుగడ. ఈ పరిస్థితుల్లో రిటైర్మెంట్ అంటేనే దిగులుపడే రోజు లొచ్చాయి. ఎందుకంటే నెలనెలా వచ్చే జీతం ఆగిపోతుంది. పైగా రావాల్సిన బెనిఫిట్స్ రావు. జీవితకాలం ప్రభుత్వ సేవలో గడిపి చివరికి రిటైర్మెంట్ సొమ్ముల కోసం న్యాయపోరాటాలు, వీధి పోరాటాలు చేయాల్సిరావడం దురదృష్టకరం. ■

అనుమతులు సాధించండి

పెండింగ్ ప్రాజెక్టులపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఎమ్మెల్యే హరీష్ రావు బహిరంగ లేఖ..

తన్నీరు హరీష్ రావు

గౌరవనీయులు శ్రీ కిషన్‌రెడ్డి గారు,
కేంద్ర బొగ్గు గనుల శాఖామాత్యులు

నమస్కారం

తెలంగాణ రాష్ట్రం నుంచి సికింద్రాబాద్ లోక్‌సభ సభ్యునిగా, కేంద్ర క్యాబినెట్ మంత్రిగా రెండవ సారి పనిచేస్తున్నందుకు అభినందనలు. కేంద్ర ప్రభుత్వం ద్వారా తెలంగాణ రాష్ట్ర సాగునీటి రంగానికి సాధించవలసిన కొన్ని అంశాలను మీ దృష్టికి తీసుకురావాలని తలచి ఈ లేఖ రాస్తున్నాను.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి బనకచర్ల లింక ప్రాజెక్టును సుమారు రూ.80 వేల కోట్లతో చేపట్టి 200 టీఎంసీల గోదావరి నీటిని బనకచర్ల రెగ్యులేటర్ కాంప్లెక్స్ ద్వారా పెన్నా బేసిన్‌కు తరలించాలని తలపోసిన సంగతి, ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం నిధులు సమకూర్చే విషయమై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గారికి రెండు లేఖలు కూడా రాసిన సంగతి మీకు తెలిసే ఉంటుందని ఆశిస్తున్నాను. ప్రాజెక్టు వివరాలు పంపించమని కేంద్ర ప్రభుత్వం గోదావరి బోర్డుకు సూచించినట్టు కూడా పత్రికల్లో వార్తలు వచ్చినాయి. దీన్నిబట్టి చంద్రబాబు నాయుడు గారి లేఖను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నట్టుగా అవగతమవుతున్నది. గోదావరి నదీజలాల్లో తెలంగాణ నీటి హక్కులకు ఈ ప్రాజెక్టు వల్ల భంగం వాటిల్లనున్నదని సాగునీటిరంగ నిపుణులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం 2014 ప్రకారం కొత్త ప్రాజెక్టు చేపట్టినప్పుడు గోదావరి/ కృష్ణా బోర్డుల అనుమతి, ఆ తర్వాత అపెక్స్ కౌన్సిల్ అనుమతి తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణకు గాని, బోర్డులకు గాని సమాచారం అందించకుండానే ఏకపక్షంగా విభజన చట్టాన్ని ఉల్లంఘించి ప్రాజెక్టును నిర్మించడానికి ముందుకుసాగుతున్నది.

> ***గోదావరి ట్రిబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 1480 టీఎంసీల నీటిని కేటాయించింది. అందులో తెలంగాణ ప్రాజెక్టులకు 968 టీఎంసీలు ఉమ్మడి రాష్ట్రంలోనే వివిధ జీవోల ద్వారా కేటాయించబడినాయి. ప్రాజెక్టులకు నీటి కేటాయింపులైతే ఉన్నాయి కానీ, ఉమ్మడి రాష్ట్రంలో ప్రాజెక్టులు నిర్మాణం కాకపోవడం వల్ల, కొన్ని ప్రాజెక్టులు పాక్షికంగా నిర్మాణమైనందున తెలంగాణ వాస్తవ వినియోగం 200 టీఎంసీలకు మించి లేకుండినది.***

తెలంగాణ రాష్ట్ర సాధనా ఉద్యమానికి సాగునీటి ఆకాంక్షలే ప్రధాన చోదకశక్తిగా ఉన్నాయని మీకు తెలియనిది కాదు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గోదావరి జలాలను సంపూర్ణంగా వినియోగించుకునే లక్ష్యంతో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అనేక భారీ ప్రాజెక్టులను చేపట్టింది. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసింది. తెలంగాణలో వ్యవసాయానికి అనాదిగా ప్రాణాధారంగా ఉన్న మైనర్ ఇరిగేషన్ వ్యవస్థను మిషన్ కాకతీయ ద్వారా పునరుద్ధరించింది. మేజర్, మీడియం ప్రాజెక్టుల కాలువల వ్యవస్థలను ఆధునీకరించింది. నదులు, వాగులపై కొత్తగా 1,250 చెక్ డ్యాంలను నిర్మించింది. చెరువులను, చెక్ డ్యాంలను ప్రాజెక్టులతో అనుసంధానం చేసింది. ఎండకాలంలోనూ చెరువులు, చెక్‌డ్యాంలలో నిండుగా నీటిని సరఫరా చేసింది. ఈ చర్యల ద్వారా రైతాంగానికి రెండు పంటలకు సాగునీటి సౌకర్యం గణనీయంగా మెరుగుపడింది.

గోదావరిలో నీటి లభ్యత పుష్కలంగా ఉన్నది దిగువ గోదావరి (+-10) సబ్ బేసిన్‌లోనే. ఈ నీటిని ఎత్తిపోసి ఎగువన ఉన్న ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు, పరిశ్రమలకు నీరందించడానికి తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం (240 టీఎంసీలు), సమ్మక్క సాగర్ (47 టీఎంసీలు), సీతమ్మసాగర్ (65 టీఎంసీ), బీఆర్ అంబేద్కర్ వార్ధా ప్రాజెక్టు (12 టీఎంసీలు) ప్రాజెక్టులను రూపకల్పన చేసింది. ఇందులో కాళేశ్వరం, సమ్మక్క సాగర్ ప్రాజెక్టులు పూర్తయ్యాయి. సీతమ్మసాగర్ ప్రాజెక్టు పనులు 70 శాతం పూర్తయ్యాయి. కేంద్ర ప్రభుత్వం జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో సూచించినట్టుగా వీటికి కేంద్రం నుంచి అనుమతులు సాధించడానికి సమగ్ర ప్రాజెక్టు నివేదికలు తయారుచేసి కేంద్ర జల సంఘానికి పంపించడం జరిగింది. వీటితో పాటు గెజిట్‌లో పూర్తయినా అనుమతులు లేని ప్రాజెక్టులుగా పేర్కొన్న మరికొన్ని ప్రాజెక్టులకు.. చిన్న కాళేశ్వరం, చౌటుపల్లి హనుమంతరెడ్డి లిఫ్ట్, కడెం లిఫ్ట్, చనాఖా కోరాట, మోడికుంటవాగు (ప్రతిపాదనలో ఉన్నది) ప్రాజెక్టుల డీపీఆర్‌లను కూడా కేంద్ర జల సంఘానికి పంపడమైనది. మూడేండ్ల నిరంతర కృషి ఫలితంగా కేంద్రం నుంచి చిన్న కాళేశ్వరం, చౌటుపల్లి హనుమంతరెడ్డి లిఫ్ట్, కడెం లిఫ్ట్, చనాఖ, కొరాట, మోడికుంట వాగు ప్రాజెక్టులకు టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ) నుంచి అనుమతులు సాధించగలిగాము. సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు కూడా కేంద్ర జలసంఘం అన్ని డైరెక్టరేట్ల నుంచి అనుమతులు సాధించడంలో సఫలీకృతమైనాము. నిరంతర కృషి వల్ల కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ నుంచి అటవీ, పర్యావరణ అనుమతి కూడా సాధించగలిగాం. గోదావరి బోర్డు కూడా టీఏసీ అనుమతి కోసం కేంద్ర జలసంఘానికి సిఫారసు చేసింది. అయితే నెలలు గడుస్తున్నా సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు టీఏసీ అనుమతి ఇంకా రాలేదు. అందుకు ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కృషి ఏమిటో ఎవరికి తెలియదు.

అదేవిధంగా సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు కూడా కేంద్ర జలసంఘం ఇంటర్ స్టేట్ అనుమతి మినహా అన్ని అనుమతులు జారీచేసింది. కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ నుంచి అటవీ, పర్యావరణ అనుమతి కూడా సాధించగలిగాము. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి ఎన్‌వోసీ పొందితే తప్ప ఇంటర్ స్టేట్ అనుమతి సాధ్యం కాదు. ఏడాది గడచినా ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి ఎన్‌వోసీ సాధించలేకపోయింది. భవిష్యత్తులో వరద జలాలను వినియోగించుకునే లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక టీఎంసీ నీటిని అదనంగా ఎత్తిపోసే ఖర్చును చేర్చి సవరించిన అంచనా విలువతో అనుమతి కోసం కేంద్ర జల సంఘానికి పంపించడం జరిగింది.

తెలంగాణ ప్రాజెక్టులు నాలుగు. 1.కాళేశ్వరం అదనపు టీఎంసీ కలుపుకొని రోజుకు 3 టీఎంసీలు ఎత్తిపోసే ప్రాజెక్టు నివేదిక 2.సమ్మక్క సాగర్ ప్రాజెక్టు నివేదిక 3.సీతమ్మసాగర్ ప్రాజెక్టు నివేదిక 4.బీఆర్ అంబేద్కర్ వార్ధా ప్రాజెక్టు నివేదిక అనుమతుల కోసం కేంద్ర వద్ద పెండింగ్‌లో ఉన్న సంగతి మీ దృష్టికి తీసుకువస్తున్నాను. వీటికి అనుమతులు ఇవ్వకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన గోదావరి బనకచర్ల ప్రాజెక్టును పరిగణనలోకి తీసుకొని నిధులు కేటాయిస్తే తెలంగాణ ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బతింటాయి. కేంద్ర మంత్రిగా ఉన్న మీరు మీ పరపతిని ఉపయోగించి కేంద్ర జలసంఘం అన్ని అనుమతులు పొందిన సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు టీఏసీ అనుమతి జారీ అవడానికి సహకరించవలసిందిగా కోరుతున్నాను. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి వచ్చింది. మీరు చొరవ చూపి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఎన్‌వోసీ ఇప్పించగలిగితే సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు కూడా అనుమతుల ప్రక్రియ ముందుకు సాగుతుంది.

> ***దక్షిణ తెలంగాణకు ప్రాణాధారమైన ప్రాజెక్టు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం. 2014 ఎన్నికల ప్రచార సభలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు కూడా బీజేపీ అధికారంలోకి వస్తే పాలమూరు ప్రాజెక్టును పూర్తిచేస్తామని పాలమూరు ప్రజలకు వాగ్దానం చేసిన సంగతి మీకు గుర్తుండే ఉంటుంది. తెలంగాణకు కేటాయించిన నికరజలాల నుంచి 90 టీఎంసీల నికర జలాలు పాలమూరు ప్రాజెక్టుకు కేటాయిస్తూ కేసీఆర్ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ తర్వాత సమగ్ర ప్రాజెక్టు నివేదికను అటు కేంద్ర జల సంఘానికి, ఇటు పర్యావరణ మంత్రిత్వ శాఖకు పంపించడమైనది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నికర జలాల కేటాయింపుల జీవోను వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినందున కేంద్ర జల సంఘ అనుమతుల ప్రక్రియను నిలిపివేసింది.***

అయితే, పర్యావరణ మంత్రిత్వ శాఖ నియమించిన నిపుణుల సలహా కమిటీ (ఈఏసీ) మాత్రం ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతిని జారీ చేయవచ్చునని మంత్రిత్వ శాఖకు సిఫారసు చేసింది. ఏడాది గడిచినా పర్యావరణ మంత్రిత్వ శాఖ మాత్రం పర్యావరణ అనుమతిని పెండింగ్‌లో పెట్టింది. అనేక అడ్డంకులను అధిగమించి సుప్రీం కోర్టు ద్వారా ప్రాజెక్టులో తాగునీటి పనులు కొనసాగించడానికి అనుమతి పొంది, కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారా నిధులు సమకూర్చి జలాశయాలు, పంప్‌హౌజ్‌లు, పైప్‌లైన్ పనులు 70 శాతం పూర్తిచేసింది కేసీఆర్ ప్రభుత్వం. పర్యావరణ అనుమతి పొందకుండా సాగునీటి కాలువలు చేపట్ట వద్దని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) స్టే విధించింది. కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతి పొందడానికి తీవ్రంగా శ్రమించి ఈఏసీ సిఫారసు సాధించగలిగింది. ఏడాది గడచినా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పర్యావరణ అనుమతి సాధించడంలో విఫలమైంది. సాగునీటి కాలువల నిర్మాణం కోసం పర్యావరణ అనుమతి తప్పనిసరి అని తెలిసినా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నది. ఈ విషయంలో కూడా కేంద్ర క్యాబినెట్ మంత్రిగా పెండింగ్‌లో ఉన్న పర్యావరణ అనుమతిని జారీ చేయించడానికి చొరవ చూపించాలని కోరుతున్నాను.

రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పైన పేర్కొన్న అంశాలపై మీ అమూల్యమైన సమయాన్ని, పరపతిని వెచ్చించి తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు సాధించడంలో మీ వంతు కృషిచేస్తారని ఆశిస్తున్నాను. తెలంగాణ బిడ్డగా, కేంద్ర క్యాబినెట్ మంత్రిగా ఈ గురుతరమైన బాధ్యత మీ పైన ఉన్నదని గుర్తు చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

భవదీయులు
- తన్నీరు హరీష్ రావు
(సిద్దిపేట శాసనసభ్యులు, మాజీ సాగునీటి మంత్రి)



సమాజంలో మార్పు రావాలి

వరకట్నం, గృహ హింస చట్టాల దుర్వినియోగం విషయంలో మేం (సుప్రీంకోర్టు) ఏమీ చేయలేం. అందుకు పార్లమెంట్ చట్టాలు ఉండనే ఉన్నాయి. ఈ విషయమై సమాజంలో మార్పు రావాల్సిందే.

- జస్టిస్ నాగరత్న, సుప్రీంకోర్టు జడ్జి

> **తెలంగాణలోని ఒక గ్రామం 2025 జనవరిలో ప్రవేశించిన వేళ ఏ విధంగా ఉందనే కథనం ఇది. ఆ ఊరు నల్లగొండ జిల్లాలోనిది. కొన్ని కారణాల వల్ల పేరు రాయటం లేదు. అక్కడ కొద్దిరోజులు గడిపిన మీదట గమనించిన విషయాలివి. ఇది అన్ని విషయాల గురించి సమగ్ర సర్వే వంటిది కాదు. కొద్ది రోజులలో అది సాధ్యం కాదు కూడా. పైగా ఉద్దేశం సర్వే కాదు, సమగ్రతా కాదు. అక్కడి పరిస్థితులను వీలైనంత వరకు చూస్తూ పోవటం, ప్రజల నుంచి వింటూ పోవటం వరకే. ఆయా అంశాలపై వారితో చర్చించటమో, వాదించటమో అంతకన్నా కాదు. ఏ విషయాలైనా వివరంగా ప్రస్తావనకు వచ్చాయంటే అవి వారు తమంతట తాము చెప్పినవే. మొత్తం మీద అక్కడ చూసిన, ప్రజలు చెప్పిన విషయాలను బట్టి, అక్కడ వస్తున్న మార్పులు అనేకం ఉన్నట్టు అర్థమైంది. వాటిలో మంచి చెడులు రెండూ ఉన్నాయి.**

ఒక తెలంగాణ గ్రామం-2025

టంకశాల అశోక్

ఆ ఊరి జనాభా కచ్చితంగా ఇంత అని ఎవరూ చెప్పలేకపోయారు. ఇప్పుడిప్పుడే మాజీ అయిన సర్పంచ్‌తో సహా. వేర్వేరు వ్యక్తుల అంచనాలు 1,500 నుంచి 2,000 వరకు ఉన్నాయి. ఓటర్ల సంఖ్య అంచనాలు కూడా అందుకు వందల తేడాలతో వినిపించాయి. ప్రజలలో అత్యధికులు బీసీలు, ఎస్సీలు. పెద్ద చెరువున్నది. ఎండకాలంలోనూ నీళ్లుంటాయి. బోర్లు కూడా తగినన్ని ఉన్నాయి. వరి, వేరుశనగ, మిరప, మక్కజొన్న ప్రధానమైన పంటలు. కొబ్బరిచెట్లు కూడా చాలా కనిపించాయి. మంచినీరు, కరెంటు, సిమెంటు రోడ్లు, స్కూలు, ఆరోగ్య కేంద్రం, బస్సు రవాణా, సమీప గ్రామంలో పోలీసు స్టేషన్ వంటి వసతులన్నీ ఉన్నాయి. కొద్ది మందికి కార్లు, చాలామందికి మోటార్ బైకులున్నాయి. ఊరిలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, కమ్యూనిస్టు పార్టీలు అన్నీ ఉన్నాయి. కొందరు మాజీ నక్సలైట్లున్నారు. దేని బలం ఎంతన్నది తర్వాత చూడవచ్చు. వాటిలో ఒక పార్టీకి జిల్లా స్థాయి నాయకునిది ఇదే ఊరు.

ప్రజలలో అధికులు రైతులు, వ్యవసాయ కూలీలు, కల్లుగీత వారు, నేతపని వారు. రజకులవంటి ఇతర వృత్తుల వారూ ఉన్నారు. ఊరిలో పేదరికమన్నది లేదు. అన్ని సంక్షేమ పథకాలు అమలులోకి వచ్చాయి. వాటి అమలుతీరులో కొత్త ప్రభుత్వ పాలనలో వచ్చిన తేడాలను ముందు ముందు చూద్దాము. గ్రామంలో ఎక్కువగా ఉన్నది గ్రామ దేవతలే. ఒకటి, రెండు మాత్రం కాస్త పెద్ద గుళ్లున్నాయి. మరొకటి కట్టాలని ఆలోచిస్తున్నారు. జనాభాలో అతికొద్ది మంది మాత్రం ముస్లింలు, క్రైస్తవులు. ఊరిలో చాయ దుకాణాలున్నాయి. అంతకన్న ఎక్కువగా బెల్టుషాపులున్నాయి. వాటి సంఖ్య 18. నీరు, విద్యుత్తు, రైతు పథకాల వల్ల మంచి పంటలు, వాటిపై ఆదాయాలు, సంక్షేమ పథకాల నగదు బదిలీ, అనేకులు హైదరాబాద్‌లో పనిచేస్తూ సంపాదిస్తుండటం అనే మూడు కారణాల వల్ల ఊరి వారి చేతిలో పైసలు గలగలలాడుతున్నాయి.

స్థూలంగా ఆ ఊరి ముఖచిత్రం ఇది. ఇందులో బెల్టుషాపులను, కొన్ని సందర్భాలలో కుటుంబ సంబంధాలలో అవాంఛనీయ మార్పులను మినహాయిస్తే తక్కినవన్నీ సానుకూలమైన పరిణామాలు. ఇది 'కొద్దిగా' వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాలంలో మొదలైనా, ప్రధానంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ పాలనలో జరిగిందన్నది ఏకాభిప్రాయం. చెరువు గట్టు వెంట, పొలాల వెంట నడుస్తుండగా అందరూ, ఈ పదేండ్లలోనే చెరువు ఇంతగా నిండటం, కాలువలు పారటం, బోర్లలో నీళ్లు, వాటికి కరెంటు అనేవి మొదలయ్యాయన్నారు. దానితో అంతకుముందు పడావు పడ్డ భూములు సాగులోకి వచ్చినట్టు చెప్పారు. నాకూ చూపించారు. ఇవన్నీ ఇక ఎటూ పోయేవి కావు గనుక సుస్థిర ఫలితాలనిస్తున్నాయి. కొన్నింటి విషయంలో మాత్రం గత ఏడాదిగా అస్థిరతలు ఏర్పడ్డాయన్నది అందరి ఫిర్యాదుగా వినిపించింది. అవి, రైతుబంధు, రైతుబీమా, పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, మహిళలకు నెలకు రూ.2,500 మొదలైనవి. ఇవన్నీ తెలంగాణ అంతటా వినిపిస్తున్న మాటలే.

వాటి పరిస్థితి ఆ విధంగా ఉన్నప్పటికీ, పైన పేర్కొన్న మూడు కారణాల వల్ల గ్రామస్థుల చేతిలో డబ్బు గలగలలాడుతూనే ఉంది. దానితో వాళ్లేం చేస్తున్నారు? ఇప్పుడు ఆహారానికి, వస్త్రాలకు, గృహవసతికి లోటులేదు. చిరిగిన బట్టల వారెవరూ కన్పించలేదు. ఎక్కువగా పెంకుటిళ్లే ఉన్నా, మెల్లమెల్లగా డాబా ఇళ్లు వస్తున్నాయి. కొద్దిమంది సీసీ కెమెరాలు పెడుతున్నారు. పిల్లలు ప్రభుత్వ పాఠశాలలను వదిలి, ఆ ఊరికే వచ్చి తీసుకుపోయే స్కూలు బస్సులలో పొరుగూరి ప్రైవేటు స్కూళ్లకు పోతున్నారు. చాలామంది హైదరాబాద్‌లో కోర్సులు చదువుతున్నారు. సుమారు డజను మంది విదేశాలలో చదవటమో, ఉద్యోగాలు చేయటమో చేస్తున్నారు. పెళ్లిళ్లు కాని ఇతర ఫంక్షన్ల వద్ద కూడా ఒక మోస్తరు అట్టహాసాలు కన్పించాయి. మరొకవైపు, బాగా భూములున్న ఆసాములు మరింత బాగుపడటం కోసం క్రమక్రమంగా భూములు అమ్ముకొని, లేదా కౌలుకు ఇచ్చి నగరాలకు తరలిపోతుండగా, వారి కన్నా ఇంత కాలం దిగువ స్థాయిలో గలవారు వాటిని ఖరీదు చేయటమో, కౌలుకు తీసుకోవటమో కనిపిస్తున్నది. ఈ లావాదేవీలన్నీ సజావుగానే సాగుతున్నాయి. ఇందులోని ఒక ఆసక్తికర అంశం, బయటికిపోయి బాగుపడిన వారు ఇక్కడి తమ భూములలో కొంత భాగాన్ని, ఇళ్లను పేదలకో, ఊరి ఉపయోగానికో ఉచితంగా బదిలీ చేస్తుండటం. భూముల ధర అక్కడ ప్రస్తుతం ఎకరానికి రూ.30 లక్షలకు చేరినా ఇది కన్పిస్తున్నది. ఇళ్లున్నవారు రోడ్ల విస్తరణ కోసం ఒక అంగుళమైనా వదిలేందుకు ససేమిరా అంటున్న రోజులలో, ఇంటిముందున్న స్థలాలను పరిహారమైనా కోరకుండా వదులుతున్నారు.

ఆర్థిక పరిస్థితులు బాగుపడుతుండటంతో నేరాలు తగ్గిపోయాయి. ఒకప్పటి వలె పంటలకు, ధాన్యం కుప్పలకు కాపలా కాసుకోవటం లేదు. వ్యవసాయరంగంలో యాంత్రీకరణ వేగంగా పెరుగుతున్నది. ట్రాక్టర్లు మొదలుకొని హార్వెస్టర్ల వరకు అనేక యంత్రాలు ఆ ఊరిలో, దానిచుట్టుపక్కల గ్రామాలలో కన్పించాయి. అయినా కూలి పనులు చేసుకునేవారికి పనుల కొరత మాట వినిపించలేదు. సంక్షేమ పథకాలను కలుపుకొని వారి జీవితాలు సాఫీగానే సాగుతున్నాయి. దళితులపై అత్యాచారాల సూచనలు లేవు. అంటరానితనం పోయింది. అయితే దేవాలయ ప్రవేశం వంటి విషయాలలో వివక్ష ప్రశ్నపై నాకు స్పష్టత రాలేదు. కొందరు ఉండనగా కొందరు లేదన్నారు. నేరుగా వారితో మాట్లాడేందుకు వీలవలేదు. అయితే ఇతర చోట్ల వలె ఇక్కడ దళితులు ఇతర మతాలలో చేరిన సందర్భాలు అరుదు. దానిని ఒక సూచికగా తీసుకుంటే, వివక్షలు అంతగా లేవనుకోవాలి. వాళ్ల పిల్లలు స్కూళ్లలో అందరితో కలిసే కూర్చుంటున్నారు, ఆడుకుంటున్నారు.

ఆర్థిక మార్పుల వల్ల కొన్ని వృత్తులపై ప్రభావం ఉంటున్నది. కొత్త తరం ఉనికిలోకి రావటం కూడా అందుకు ఒక కారణం. ఉదాహరణకు, ఊరిలో తాటిచెట్లు విరివిగా ఉన్నాయి. కల్లు తాగేవారు ఎక్కువే. ఇంకా చెప్పాలంటే అత్యధికులు తాగేవారే మహిళలతో సహా. కానీ, గీతకార్మికుల సంఖ్య బాగా తగ్గింది. కొత్త తరం వారు బయటకుపోగా మిగిలిన యువకులు కూడా చెట్లెక్కడం లేదు. నేత పరిశ్రమ కూడా అదే సమస్యను ఎదుర్కొంటున్నది. వారు పెద్ద సంఖ్యలో సూరత్, షోలాపూర్‌లకు పోగా ప్రస్తుతం ఇద్దరు మాత్రం చిన్న చిన్న పవర్‌లూమ్‌లు నడుపుతున్నారు. వయస్సు పైబడినవారు చాలామంది ఒంటరి జీవితాలు గడుపుతున్నారు. అయినా అందులో చాలామంది ఏవో పనులు చేస్తూనే ఉన్నారు.

పార్టీలలో బీఆర్ఎస్ బలంగా ఉన్నట్టు తోచింది. కాంగ్రెస్ ఇతరత్రా కూడా తక్కువ కాగా, ప్రస్తుత ప్రభుత్వ పరిపాలన తీరు వల్ల ప్రజలకు దానిపై గురి కుదరటం లేదు. బీజేపీ నామమాత్రం. గతంలో కమ్యూనిస్టులు, నక్సలైట్లు బలంగా ఉండినా వారు కూడా నామమాత్రమయ్యారు. కనుమరుగయ్యారనటం ఇంకా సరిగా ఉంటుంది.

> **ఒక్కొక్క షాపులో సగటు మద్యం అమ్మకాలు నెలకు లక్షకు పైమాటే. అదనంగా చికెన్ ఆదాయాలుంటాయి. పంటల రాబడి, జీతాల రాబడి, పింఛన్లు మొదలైన రాబడి సమయాలలో, పండుగలప్పుడు ఇంకా ఎక్కువ. ఇంత చిన్న గ్రామంలో ఇంత ఖర్చుకు డబ్బెక్కడిదని అడగగా, నీకు చెప్పిన రకరకాల రాబడులలోనే అందుకు సమాధానం ఉందన్నాడు.**

నేను బస చేసిన మిత్రుని ఇంటికి సరిగా ఎదురుగా ఒక బెల్ట్‌షాప్ ఉంది. అక్కడి 18 షాపులలో అది ఒకటి. యజమానితో మాట్లాడి, గిరాకీ ఎవరు లేని ఒక మధ్యాహ్న సమయంలో లోపలకు వెళ్లి చూశాను. తనంతట తానే చాలా విషయాలు చెప్పాడు. ఇంకా తెల్లవారకముందు 4 నుంచి, రాత్రి 12 దాటిన తర్వాత వరకు వస్తూనే ఉంటారట. స్కూలు పిల్లలు కూడా అలవాటు పడుతున్నారని చెప్పి చాలా బాధపడ్డాడు. లోగడ బర్త్‌డేల వంటి సందర్భాలలో తమ కిరాణా షాపులో బి